తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | గురువారం - 05 - ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:249 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in

# క్యాన్సర్‌పై ఉద్యమంలా పోరాడాలి చిరంజీవి

### ముందస్తు పరీక్షలతోనే సంపూర్ణ రక్షణ సాధ్యం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మిగతా 2లో..





## మున్సిపల్ ఎన్నికల్లో

# కాంగ్రెస్‌కు ఎదురు లేదు



### మహిళా శక్తి ఎదుట ఎవ్వరూ నిలువలేరు: సీఎం రేవంత్ రెడ్డి

మిర్యాలగూడ బహిరంగ సభలో ప్రభుత్వ విజయాల వెల్లడి

**'ప్రజాపాలన – ప్రగతి బాట'లో సీఎం ప్రసంగం**

రైతుల సంక్షేమానికే ప్రభుత్వ అత్యధిక ప్రాధాన్యం

మిర్యాలగూడ, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా శక్తి ఎదుట ఎవరూ నిలువలేరని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మిర్యాలగూడలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి సీఎం ప్రశ్నలు సంధించారు. గతంలో ఒక్క కొత్త రేషన్ కార్డు అయినా ఇచ్చారా? అంటూ నిలదీశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షలాది మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు.

మిగతా 2లో..

## సనాతన ధర్మంపై

# దాడులు సహించం

### కాంగ్రెస్ పాలనలో హిందూ మనోభావాల దెబ్బ

పురపోరులో బీజేపీకి భారీ విజయం అందించాలి

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్రంలో సనాతన ధర్మంపై జరుగుతున్న దాడులను సహించబోమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హెచ్చరించారు. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపడం లేదని, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ ఆలయ భూములపై ఆక్రమణలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి తెలంగాణలో పర్యటించిన ఆయన, మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనంలో పాల్గొన్నారు.

మిగతా 2లో..




## సీఎం బినామీ అవినీతి బాగోతం

# బయటపడింది

### కేఎల్‌ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా వెనుక కవర్‌డ్రైవ్ గేమ్

నోటీసులు డైవర్షన్‌కే : కేటీఆర్ ఆరోపణ

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):



ప్రభుత్వ అవినీతిని బయటపెడుతోంది బీఆర్‌ఎస్ పార్టీనేనని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పదిరోజులుగా బీఆర్‌ఎస్ నేతలకు వరుసగా నోటీసులు జారీ చేయడంపై అనుమానాలు వచ్చాయని తెలిపారు. ముందుగా హరీష్‌రావు, ఆ తర్వాత తాను, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌రావు, చివరకు పార్టీ అధినేత కేసీఆర్‌ను విచారణకు పిలవడం వెనుక డైవర్షన్ గేమ్ ఉందని ఆరోపించారు. నోటీసుల వెనుక అసలు కారణం తాము తవ్వడం మొదలుపెట్టగానే బయటపడిందని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన భారీ బినామీ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. కేఎల్‌ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ ముఖ్యమంత్రి బినామీ సంస్థ అని ఆరోపించారు.

మిగతా 2లో..



## గద్దర్ ఫిలిం అవార్డులపై

# జ్యూరీతో సమీక్ష

### తెలుగు సినీ పరిశ్రమకు అత్యున్నత ప్రాధాన్యత

ఉగాది రోజున అవార్డుల ప్రధానోత్సవం

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో 'గద్దర్ ఫిలిం అవార్డ్స్' జ్యూరీ సభ్యులతో సమావేశం నిర్వహించినట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా ప్రభుత్వం తెలుగు సినీ పరిశ్రమకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, హైదరాబాద్‌ను దేశవ్యాప్త చలనచిత్ర పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

మిగతా 2లో..

## మేడారంలో ఘనంగా వన దేవతల

# తిరుగువారం పండుగ

ఐదు లక్షల మంది భక్తులతో కిటకిటలాడిన జాతర

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: మంత్రి సీతక్క

2లో





## కుటుంబ కలహం

# ప్రాణం తీసింది

- పొలం వద్ద మహిళా న్యాయవాది హత్య
- సోదరుడే కత్తితో దాడి

2లో

# తెలంగాణ ఈసెట్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):



**తెలంగాణ ఈసెట్ (TG ECET 2026)కు షెడ్యూల్ విడులైంది. ఫిబ్రవరి 9 నుంచి ఏప్రిల్ 18 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగనుంది. ఈసెట్ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా మే 15న నిర్వహించనున్నారు. ఈసెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ (మ్యాథమేటిక్స్) అభ్యర్థులకు 2026-2027 విద్యా సంవత్సరంలో బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో నేరుగా రెండో ఏడాదిలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించనుంది.**

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మేడారంలో ఘనంగా వన దేవతల తిరుగువారం పండుగ

**ములుగు, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వన దేవతల తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర తిరుగువారం సందర్భంగా సుమారు ఐదు లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఐదు వేల మంది కార్మికులతో నిరంతర పారిశుధ్య పనులు చేపట్టారు. బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి జాతర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మేడారం గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచేలా నిరంతర పారిశుధ్య పనులు చేపట్టాలని, భక్తులు, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రధాన జాతర ముగిసిన తర్వాత కూడా భక్తుల రద్దీ కొనసాగుతుండటంతో తాగునీరు, పారిశుధ్యం, రవాణా సౌకర్యాల్లో ఎలాంటి లోపం లేకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. 2026 మేడారం మహా జాతరకు రెండు కోట్ల మందికి పైగా భక్తులు హాజరయ్యారని, ఇంకా వారం రోజులపాటు రద్దీ కొనసాగుతుందని పేర్కొన్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, డీఎస్పీ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురు లేదు

(మొదటి పేజీ తరువాయి)



3.15 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, 50 లక్షల పేద కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని వివరించారు. వరికి రూ.500 బోనస్ తమ ప్రభుత్వ హయాంలోనే అమలవుతోందని చెప్పారు. రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రూ.21 వేల కోట్ల మేర రైతు రుణమాఫీ చేశామని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరే అన్నారని అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు వ్యాఖ్యలను గుర్తు చేస్తూ విమర్శలు గుప్పించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఆడబిడ్డలంతా కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్ఎస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా దక్కవని వ్యాఖ్యానించారు.
బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన సీఎం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు కానీ పేదలను పట్టించుకోలేదని మండిపడ్డారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, తాము రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి, భార్యాభర్తల ఫోన్లు కూడా విన్నారని, సినిమా తారల ఫోన్లను సైతం ట్యాప్ చేశారని ఆరోపించారు. దోపిడీ చేసిన వారు జాతిపితలు ఎలా అవుతారని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# సనాతన ధర్మంపై దాడులు సహించం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ, తెలంగాణ ఉద్యమంలో పోరాడిన వీరులకు నమస్కరిస్తున్నానని నితిన్ నబీన్ తెలిపారు. కొన్ని వర్గాలను సంతృప్తిపరచేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, ముఖ్యంగా ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఆరాటపడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు న్యాయం జరగలేదని, వక్ఫ్ బోర్డును బలోపేతం చేయడానికి యత్నిస్తూనే ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో కోతలు పెడుతోందని ఆరోపించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని నితిన్ నబీన్ మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలు మోసపోయారని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు కమీషన్ల పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలంటే బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు సముచిత స్థాయిలో కేంద్రం నిధులు మంజూరు చేస్తోందని నితిన్ నబీన్ తెలిపారు. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి రూ.5400 కోట్లకు పైగా కేటాయించామని, మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు, రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోందని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఆదరణ పెరుగుతోందని, పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి భారీ విజయం అందించాలని ఆయన ప్రజలను కోరారు.

# సీఎం బినామీ అవినీతి బాగోతం బయటపడింది

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదు, బినామీ మాస్టర్ కూడా అని విమర్శించారు.
ముఖ్యమంత్రి ఉపయోగిస్తున్న ల్యాండ్‌క్రూజర్ వాహనం కూడా కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ పేరుపై రిజిస్టర్ అయిందని కేటీఆర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి కాకముందే ఆ వాహనాన్ని వినియోగించారని, దాదాపు రెండున్నర కోట్ల రూపాయల విలువైన కారును ఆ కంపెనీ ఎందుకు కొనిచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదాయపన్ను శాఖ విచారణలో కేఎల్ఎస్ఆర్ నుంచి రేవంత్‌కు సంబంధించిన భూపాల్ ఇన్‌ఫ్రా కంపెనీకి భారీగా నిధులు బదిలీ అయినట్లు వెల్లడైందని తెలిపారు. రెండువేల పద్దెనిమిదిలోనే కేఎల్ఎస్ఆర్ కంపెనీపై ఆదాయపన్ను దాడులు జరిగాయని, రెండువేల ఇరవై మూడు నాటికి ఆ సంస్థ దివాళా తీసిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించే స్థితిలో లేని కంపెనీకి సీఎం అయ్యాక ఆరు వేల కోట్ల రూపాయల పనులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసి, జనవరి ఇరవై మూడు నాడు దర్యాప్తు సంస్థలతో విచారణ చేయాలని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు.
దివాళా తీసిన కంపెనీకి వేల కోట్ల ప్రాజెక్టులు అప్పగించిన ఈ అవినీతిపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ బాగోతం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు.

# గద్దర్ ఫిలిం అవార్డులపై జ్యూరీతో సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

సినీ పరిశ్రమ అభివృద్ధి ద్వారా యువతకు, టెక్నీషియన్లకు, రచయితలకు, దర్శకులకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. సృజనాత్మకత, సాంకేతికతకు అనుకూల వాతావరణం కల్పిస్తూ పరిశ్రమను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ సమాజం కోసం, కళల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేస్తూ, ఆయన స్మరణార్థంగా గద్దర్ ఫిలిం అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అవార్డుల ఎంపికలో ప్రతిభ, పారదర్శకత మాత్రమే ప్రధాన ప్రమాణాలుగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి అవార్డుల స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఉగాది పండుగ రోజైన మార్చి 19న గద్దర్ ఫిలిం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా ప్రభుత్వం నిర్వహించనుందని భట్టి విక్రమార్క తెలిపారు.




# కాంగ్రెస్ పాలనపై బీజేపీ నేతల తీవ్ర విమర్శలు

- తెలంగాణ రాజకీయాలు దయనీయంగా మారాయి: నితిన్ నబిన్ సిన్హా
- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలి: కిషన్ రెడ్డి





**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో రాజకీయాలు అత్యంత దయనీయ స్థితికి చేరుకున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని నితిన్ నబిన్ సిన్హా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని ముఖ్యమంత్రే ప్రకటించారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని, రాష్ట్రంలో వక్ఫ్ బోర్డుకు 77 వేల ఎకరాల భూమి ఉందని పేర్కొన్నారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అనేక హిందూ దేవాలయాలను కూల్చేశారని నితిన్ నబిన్ సిన్హా మండిపడ్డారు. ఆలయాలపై రాజకీయం చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని, అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ మహిళలను లక్షాధికారులను చేయాలని ప్రయత్నిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు.
ఈ సమావేశంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, ఉచిత బస్సు ప్రయాణం తప్ప ప్రజలకు ఏమీ ఇవ్వలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయని, చేతలు గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని, అప్పుడు అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలకు కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# కుటుంబ కలహం ప్రాణం తీసింది

**రంగారెడ్డి, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):**




రంగారెడ్డి జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లిలో పొలం వద్ద మహిళా న్యాయవాది స్వప్న హత్యకు గురయ్యారు. కుటుంబ కలహాల నేపథ్యంలో స్వంత సోదరుడే ఆమెను కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. చేవెళ్ల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న స్వప్నకు కుటుంబంలో ఆస్తి సంబంధిత వివాదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం పొలం వద్ద కుటుంబ సభ్యుల మధ్య పంచాయితీ జరుగుతుండగా, మాటా మాటా పెరిగి వాగ్వాదంగా మారింది. ఆ క్రమంలో సోదరుడు కత్తితో ఆమె మెడపై దాడి చేయడంతో స్వప్న అక్కడికక్కడే తీవ్రంగా గాయపడి మృతి చెందారు. స్థానికులు ఘటనను గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ హత్య ఘటనపై న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లాయర్ స్వప్న హత్యను నిరసిస్తూ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయవాదులు ధర్నాకు దిగారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతూ, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# క్యాన్సర్‌పై ఉద్యమంలా పోరాడాలి చిరంజీవి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన క్యాన్సర్‌పై అవగాహన, ముందస్తు గుర్తింపు ఎంత కీలకమో వివరించారు. క్యాన్సర్‌తో పోరాటాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తన ఆరోగ్యానికి సంబంధించి ఓ వ్యక్తిగత అనుభవాన్ని చిరంజీవి పంచుకున్నారు. తాను ఆరోగ్యకర జీవనశైలిని పాటించినప్పటికీ ముందుజాగ్రత్తగా కోలనోస్కోపీ పరీక్ష చేయించుకున్నానని తెలిపారు. ఆ పరీక్షలో క్యాన్సర్ కాని పాలిప్స్ కనిపించడంతో వాటిని తొలగించారని చెప్పారు. దీనిపై కొందరు తప్పుగా తనకు క్యాన్సర్ వచ్చిందని ప్రచారం చేశారని, అది నిజం కాదని స్పష్టం చేశారు. చిన్న అవకాశం ఉన్నా కూడా క్యాన్సర్‌గా మారకుండా ఉండేందుకే పరీక్షలు చేయించుకున్నానని వివరించారు. క్రమం తప్పకుండా పీఎస్ఏ వంటి పరీక్షలు చేయించుకుంటున్నానని తెలిపారు. శరీరం ఇచ్చే సంకేతాలను నిర్లక్ష్యం చేయకూడదని, 'నాకు రాదు' అనే భావన ప్రమాదకరమని చిరంజీవి హెచ్చరించారు. తన స్నేహితుడు ఒకరు ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం వల్ల చికిత్సతో పూర్తిగా కోలుకుని పదేళ్లుగా ఆరోగ్యంగా ఉన్నారని ఉదాహరణగా చెప్పారు. జీవనశైలి, వాతావరణం, వంశపారంపర్య కారణాల వల్ల ఎవరికైనా క్యాన్సర్ రావచ్చని, అయితే తొలిదశలో గుర్తిస్తే ఎక్కువ శాతం కేసులు నయం చేయవచ్చని వివరించారు.




మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. తొమ్మిది నుంచి పద్నాలుగు ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకా వేయిస్తే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను పూర్తిగా నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారని గుర్తుచేశారు. నలభై ఐదు ఏళ్ల లోపు మహిళలు కూడా ఈ టీకా తీసుకోవడం మేలు చేస్తుందని తెలిపారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గర్భాశయ సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించవచ్చని అన్నారు. భారత్‌లో ప్రతి సంవత్సరం పద్నాలుగు లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, ప్రతి నిమిషానికి ముగ్గురు ఈ వ్యాధి బారిన పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలంటే పోలియో, మశూచి నిర్మూలన తరహాలో క్యాన్సర్‌పై కూడా సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. పొగాకు, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తనవంతు బాధ్యతగా భవిష్యత్తులో చిన్న చిత్రాలు నిర్మించడానికి సిద్ధంగా ఉన్నానని చిరంజీవి ప్రకటించారు. ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని కలిసిన కొద్దికాలానికే కిమ్స్ ఆసుపత్రి నుంచి ఆహ్వానం రావడం దైవ సంకల్పంగా భావించి వెంటనే అంగీకరించానని తెలిపారు.



## దీనదయాళ్ నగర్‌లో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

- పాత ఆర్ ఆర్ డ్రైన్ స్థానంలో కొత్త ఆర్సీసీ పైపులైన్ ఏర్పాటు

**వినాయక్ నగర్, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్గిరి నియోజకవర్గం వినాయక్ నగర్ డివిజన్ దీనదయాళ్ నగర్ పరిధిలోని రోడ్ నంబర్-5 వద్ద ఉన్న పాత ఆర్ ఆర్ డ్రైన్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పాత డ్రైన్‌ను తొలగించి కొత్త ఆర్సీసీ పైపులైన్‌ను ఏర్పాటు చేశారు.పాత డ్రైన్ కూలిపోయి ప్రమాదకరంగా మారడంతో వర్షాకాలంలో మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి దుర్వాసన, దోమల బెడదతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఆధునిక సాంకేతిక ప్రమాణాలతో ఆర్సీసీ పైపులైన్ ఏర్పాటు పనులు చేపట్టారు.ఈ అభివృద్ధి పనులను కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబెర్ ఓం ప్రకాష్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ ఏఈ నవీన్, సూపర్వైజర్ సాగర్ పనుల వివరాలను వారికి తెలియజేశారు. నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, కాలనీవాసుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు మరియు కాలనీ వాసులు పాల్గొని అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు.



## ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక

**ఉప్పల్ , ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు ఉప్పల్ ఎక్సైజ్ సీఐ ఓంకార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆయన ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సీఐ ఓంకార్ మాట్లాడుతూ, సమాజంలో ప్రజలకు వాస్తవాలను తెలియజేయడంలో మీడియా కీలకమైన, బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తోందని అన్నారు.ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన కమిటీ సభ్యులు ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువచ్చేలా పనిచేయాలని ఆకాంక్షించారు. చట్టపరమైన అవగాహన కల్పించడంలో, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో మీడియా మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.ఉప్పల్ ప్రాంతంలో శాంతిభద్రతలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో మీడియా సహకారం ఎల్లప్పుడూ అవసరమని పేర్కొన్న ఆయన, ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్‌కు, నూతన కమిటీకి ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ తరఫున పూర్తి సహాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాన్ని ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్ ప్రభుదాస్

**నాచారం, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ ఫేజ్-1 ఓం శాంతి బిల్డింగ్ గల్లీలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి, అలాగే డివిజన్ నాయకులకు కార్పొరేటర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారి వేణుగోపాల్, కాలనీ అధ్యక్షుడు శివరాం ప్రసాద్, గోవింద రెడ్డి, చారి, శేఖర్ గౌడ్‌తో పాటు కాలనీ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్–సీపీఎం సంయుక్తంగా పోటీ

- సత్తుపల్లి మున్సిపాలిటీని మళ్లీ అభివృద్ధి బాటలో నడిపిస్తాం
- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.

**సత్తుపల్లి, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):**



సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, సీపీఎం పార్టీలు సంయుక్తంగా పోటీ చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. బుధవారం సత్తుపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 23 వార్డుల్లో 22 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు, ఒక వార్డులో సీపీఎం అభ్యర్థి బరిలో ఉన్నారని చెప్పారు. అన్ని వర్గాలు, అన్ని కులాలు, అన్ని మతాలకు సముచిత ప్రాధాన్యత ఇస్తూ అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించి నామినేషన్ ఉపసంహరించుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

02వ వార్డులో పార్టీ నిర్ణయాన్ని అతిక్రమించి ఒక అభ్యర్థి పోటీలో కొనసాగుతున్నారని, వెంటనే తప్పుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారాన్ని నిరాడంబరంగా నిర్వహిస్తామని, కల్లూరు, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్-సీపీఎం కలిసి పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసినది ఏమీ లేదన్నారు. భారత రత్న అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటు, నూతన మున్సిపాలిటీ కార్యాలయం, అశోక చక్రం, జాతీయ జెండా వంటి పనులు తమ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. 37 కోట్ల రూపాయల వ్యయంతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, ఇప్పటికీ పాత ఆసుపత్రిలోనే వైద్యం అందిస్తున్నారని విమర్శించారు. ఖమ్మంలో కూడా లేని విధంగా సత్తుపల్లిలో గ్రంథాలయం ఏర్పాటు చేశామని, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి తమ పాలనలోనే జరిగిందన్నారు. షాదీఖానా, అంబేద్కర్ భవన్, క్రైస్తవ భవన్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, సత్తుపల్లిని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దామని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల్లో పాలకులు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చూపించాలని డిమాండ్ చేశారు. సింగరేణి నిధులు తీసుకొచ్చారా? బాధితులకు ఏం చేశారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తమపై దుష్ప్రచారం జరుగుతోందని, అభ్యర్థులను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అభ్యర్థుల వ్యాపారాలను అడ్డుకుంటామని, లారీల్లో గంజాయి పెట్టేస్తామని భయపెడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే అభ్యర్థులను బరిలో నిలిపామని, స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధంగా నిధులు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ఉంటేనే అభివృద్ధి అన్న భావన తప్పుడుదని, అభివృద్ధి చేయగల నాయకత్వమే ముఖ్యమన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీని ప్రజలు తమకు అప్పగిస్తారన్న విశ్వాసం వ్యక్తం చేస్తూ, కారు గుర్తుకు ఓటేసి 22 వార్డుల బీఆర్ఎస్ అభ్యర్థులను, సుత్తి-కొడవలి గుర్తుకు ఓటేసి సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు.

ఈ సమావేశంలో కూరాకుల నాగభూషణం, కొత్తూరు ఉమామహేశ్వరరావు, కూసంపూడి మహేష్, శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, మోరంపూడి ప్రభాకర్, అమరవరపు కృష్ణారావు, సత్యనారాయణ రెడ్డి, భారతి, మోరంపూడి పాండు, రాజబాబు, మహమూద్, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్ తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ కాలం నాటి చిత్రాలను పరిరక్షించాలి

**ధర్మసాగర్,ఫిబ్రవరి04(తెలంగాణ ముచ్చట్లు):**





హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం గ్రామంలో ఉన్న పురాతనమైన ముఖ్యనాథ స్వామి ఆలయంలో ఉన్న కాకతీయుల కాలం నాటి ప్రాచీన చిత్రాలను ప్రభుత్వం పరిరక్షించాలని ప్లిచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి కోరారు. టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్యతో కలిసి ఆయన బుధవారం ఆలయాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముప్పిరినాథ స్వామి ఆలయం క్రీ.శ. 1116-1157 మధ్యకాలంలో కాకతీయ రాజు ప్రోలరాజు 2 భార్య ముప్పమాంబ నిర్మించారని, కాకతీయుల కాలం నాటి శిల్పకళకు అద్భుతమైన నిదర్శనంగా ఆలయ గోడలపై పంచతంత్ర కథలు, రామాయణ ఘట్టాలు తదితర దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని అన్నారు. దురదృష్టవశాత్తూ పరిరక్షణ చర్యల లోపం కారణంగా చిత్రాలు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని తెలిపారు. టార్చ్ కార్యదర్శి అరవింద్ ఆర్య మాట్లాడుతూ ఎనిమిది శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయం ఇప్పటికీ రాష్ట్ర పురావస్తు శాఖ పరిరక్షణలోకి రాకపోవడం శోచనీయమని రాష్ట్ర పురావస్తు శాఖ స్పందించి ఆలయాన్ని, అరుదైన కాకతీయుల కాలం నాటి చిత్రాలను కాలగర్భంలో కలిసిపోకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్ వ్యవస్థాపక చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర , గ్రామస్థులు పాల్గొన్నారు.







# లాలాపేట్ ఫ్లైఓవర్‌పై ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చెత్త వేస్తే భారీ జరిమానా

- డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా హెచ్చరిక


**మల్కాజిగిరి, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని లాలాపేట్ ఫ్లైఓవర్, విష్ణుపురి కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జ్, తాళ్ల బస్తీ రైల్వే అండర్ బ్రిడ్జ్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా శుభ్రత పనులు చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లాలాపేట్ ఫ్లైఓవర్‌పై ప్లాస్టిక్ కవర్లలో చెత్త తీసుకువచ్చి వాహనాల నుంచి అతివేగంగా విసిరివేయడం వల్ల పాదచారులు, ఇతర వాహనదారులపై పడుతూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. అలాగే పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ విధంగా చెత్త వేయించే వారిపై కఠిన చర్యలు తీసుకుని భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.గతంలో ఫ్లైఓవర్‌పై పారిశుద్ధ్య పనులు నిర్వహించే సమయంలో జిహెచ్ఎంసి సిబ్బందికి పలుమార్లు ప్రమాదాలు జరిగినట్లు ఆమె తెలిపారు. ప్రజలు ఫ్లైఓవర్లపై చెత్త విసిరివేయకుండా సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి జిహెచ్ఎంసి ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆటో టిప్పర్‌కు ఇంటి చెత్తను అందించి నెలకు రూ.100 చెల్లిస్తే నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. దీని ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఉండటంతో పాటు నగరం శుభ్రంగా, సుందరంగా ఉంటుందని వివరించారు.బహిరంగంగా చెత్త పడే ప్రాంతాలను గుర్తించి అక్కడి కాలనీవాసులకు అవగాహన కల్పించడం, నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్లపై చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు వేయించే వారిపై నిరంతరం జరిమానాలు విధిస్తున్నామని, గత రెండు రోజుల వ్యవధిలో సుమారు రూ.20 వేల వరకు జరిమానాలు విధించినట్లు వెల్లడించారు. ఈ చర్యలు ఇకపై కూడా కొనసాగుతాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, కార్యనిర్వాహక ఇంజనీర్ మహేశ్వర్, అసిస్టెంట్ ఇంజనీర్ (ఘన & వ్యర్థ) మౌనిక, సూపర్వైజర్ శ్రీనివాస్, యాదగిరి, జవాన్, బుడంపల్లి గిరి, వసంత్ అలీ నవాజ్, చిట్టిబాబు, ప్రభాకర్, శ్రీనివాస్ (ఎస్ఎఫ్ఏ) తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్ఆర్ గార్డెన్స్‌లో శాంతి సాయిజెన్ శేఖరకు ఘన సన్మానం

**సాయి జన్ శేఖర్ పుట్టినరోజు వేడుకలు**

**నాచారం, ఫిబ్రవరి 04 తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ కార్పొరేటర్‌గా పదేళ్ల పాటు డివిజన్ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ని ఘనంగా సన్మానించారు. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జన్ శేఖర్ పుట్టినరోజు సందర్భంగా ఈ వేడుకలను ఏఎన్ఆర్ గార్డెన్స్, నాచారంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడుతూ, నాచారం డివిజన్ అభివృద్ధిలో శాంతి సాయిజెన్ శేఖర్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ఆయన సేవలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. అలాగే సాయి జన్ శేఖర్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ ప్రభుదాస్, చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ గంధం జోష్నా, నాగేశ్వరరావు, కొత్త రామారావుతో పాటు నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.సుమారు 3,000 మందికి పైగా నాచారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంఘాల ప్రతినిధులు, పుర ప్రముఖులు, మునిసిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై శాంతి సాయిజెన్ శేఖర్ కి మరియు సాయి జన్ శేఖర్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## రెడ్డి–మున్నూరు కాపు స్మశాన వాటిక అభివృద్ధికి రూ.38 లక్షల నిధులు మంజూరు

- ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్ ,ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ డివిజన్ పరిధిలోని స్మశాన వాటికల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రతి స్మశాన వాటికలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.ఉప్పల్‌లోని రెడ్డి-మున్నూరు కాపు స్మశాన వాటికలో ఇప్పటివరకు సుమారు రూ.1 కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. తాజాగా ఆఫీస్ రూమ్ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.38 లక్షల నిధులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డితో కలిసి రెడ్డి-మున్నూరు కాపు స్మశాన వాటిక కమిటీ ప్రతినిధులకు నిధుల మంజూరు పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో స్మశాన వాటిక కమిటీ అధ్యక్షులు మేకల హనుమంత్ రెడ్డి, గోనె ప్రభాకర్ రెడ్డి, గిరి రామకృష్ణ, ఐనాలా వెంకటేష్, డీఆర్ రాజు, మేకల దయాసాగర్ రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మందుముల అంజి రెడ్డి, గోనె ప్రేమ్ సాగర్ రెడ్డి, సల ప్రభాకర్ రెడ్డి, మేకల శరత్ రెడ్డి, మేకల సామవేద్ రెడ్డి, గోనె కృష్ణ రెడ్డి, సిద్ధు, రోకటి నర్సింగ్, రామ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణానికి మంజూరు అయిన పత్రాల పంపిణీ

- ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఉప్పల్ డివిజన్‌ను జీహెచ్ఎంసీ పరిధిలోనే ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.ఉప్పల్ డివిజన్ పరిధిలోని న్యూ భారత్ నగర్, సౌత్ స్వరూప్ నగర్ కాలనీల్లో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన మంజూరు అయిన పత్రాలను కాలనీవాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.న్యూ భారత్ నగర్‌లో రూ.80 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.68 లక్షలతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టనుండగా, సౌత్ స్వరూప్ నగర్‌లో రూ.43 లక్షలతో దెబ్బతిన్న సీసీ రోడ్ల మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులతో కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపడతాయని, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందుతాయని రజితా పరమేశ్వర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో న్యూ భారత్ నగర్ కాలనీ అధ్యక్షుడు జాజుల నాగేష్‌తో పాటు కప్పరి ఎల్లేశ్ కుమార్, సలా ప్రభాకర్ రెడ్డి, పూస మల్లేష్, అన్నపు రెడ్డి వెంకట్ రెడ్డి, గంధం సంపత్ గౌడ్, పంగ నర్సింహ రెడ్డి, ఉప్పల జగన్, చలపతి రావు మోహన్, నారి ఎల్లయ్య, దోమకొండ నర్సింహులు, మిష్టి లాల్, గొండ్ ప్రభాకర్, బాలచారి నర్సింహ చారి, కైలా కృష్ణ రెడ్డి, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.అలాగే సౌత్ స్వరూప్ నగర్ నుంచి గజ్జల వెంకటరెడ్డి, నర్సిరెడ్డి, ప్రతాపరెడ్డి, బసిరెడ్డి, భాష, రామచందర్, బర్ల కృష్ణ, జగన్నాథ్ పటేల్, సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, నారాయణ రావు, చాపల శీను, వినోద్, జాల వెంకటేష్, నరేష్‌తో పాటు యాదగిరి కాలనీ వాసులు పెద్ద

## కూకట్పల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ మెరుపు దాడులు

**మేడ్చల్ మల్కాజిగిరి, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కూకట్పల్లి జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) చిన్నారెడ్డి ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.15 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.పెండింగ్‌లో ఉన్న బిల్లుల క్లియరెన్స్ కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. బాధిత కాంట్రాక్టర్ నుంచి ఫిర్యాదు అందడంతో ముందస్తు ప్రణాళికతో వలపన్నిన అధికారులు, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే ఎస్ఈని అదుపులోకి తీసుకున్నారు.ప్రభుత్వ



కార్యాలయాల్లో అవినీతిని ఏ మాత్రం సహించబోమని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ ఘటనతో జీహెచ్ఎంసీ వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది.

## ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- కీసర ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపు

**కీసర, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కీసర ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపునిచ్చింది.ఈ మేరకు కీసర ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఆశా వర్కర్స్ యూనియన్ సమ్మె నోటీసును సంబంధిత వైద్య అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన యూనియన్ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తూ 2025 నవంబర్ 21న జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే



రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.పేదలకు ఉపాధి హామీ కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక-పారిశ్రామిక విధానాల వల్ల ప్రజలు, కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ సహా జాతీయ కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు.ఆశా వర్కర్లను స్వచ్ఛంద సేవకులుగా కాకుండా రెగ్యులర్ వర్కర్లుగా గుర్తించాలని, 45వ, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం కార్మికుల కోసం ప్రత్యేక పే కమిషన్‌ను నియమించాలని, రెగ్యులరైజ్ చేసే వరకు కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని కోరారు.పని గంటలను 8 గంటలకు పరిమితం చేసి పనిభారాన్ని తగ్గించాలని, ఆశా వర్కర్లకు మరియు వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయాలు కల్పించి హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బస్తీబాట కార్యక్రమం

- నాగలక్ష్మి నగర్, ఎస్వీ నగర్ కాలనీల్లో ప్రజా సమస్యల పరిశీలన

**మల్లాపూర్, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నాగలక్ష్మి నగర్ కాలనీ మరియు ఎస్వీ నగర్ కాలనీల్లో కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో “బస్తీబాట” కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు, త్రాగునీటి సరఫరాలో లోపాలు, వీధి దీపాల మరమ్మత్తులకు సంబంధించిన సమస్యలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.కాలనీవాసులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్న నెమలి అనిల్ కుమార్, కాంగ్రెస్ ప్రభుత్వ





పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు చేపట్టడం తమ లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, “ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించే బాధ్యత నాది” అని అన్నారు .ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అడ్వైసర్ చిగుళ్ల మల్లేష్, ప్రెసిడెంట్ తోట నవీన్ గౌడ్, జనరల్ సెక్రటరీ సింగారి కిశోర్ కుమార్, ఎస్వీ నగర్ కాలనీ సభ్యులు శంకర్, యాదగిరి, అనిల్, నర్సింహ, మహేష్, సాయి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు వి. శ్రీనివాస్, కోయలకొండ రాజేష్, దాసరి సాయి, కృష్ణ తదితరులు హాజరయ్యారు.

## బీసీ వసతి గృహాల్లో సామాజిక న్యాయంపై అవగాహన కార్యక్రమాలు

**మెడ్చల్–మల్కాజ్‌గిరి, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ మరియు మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సామాజిక న్యాయ దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక సమానత్వం, న్యాయం, రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా వసతి గృహాల్లో విద్యార్థులతో





సామాజిక న్యాయంపై ప్రతిజ్ఞ చేయించగా, అనంతరం వ్యాసరచన పోటీలు మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు సామాజిక అసమానతలు, న్యాయం, సమాన హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అధికారులు అభినందించి బహుమతులు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నైతిక విలువలు పెరుగుతాయని వారు పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా ఈ తరహా అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

## 19వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి విజయకుమారి విస్తృత ప్రచారం

- హస్తం గుర్తుకు ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి

**సత్తుపల్లి, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున 19వ వార్డు అభ్యర్థిగా బరిలో ఉన్న కర్నాటి విజయకుమారి ఎన్నికల ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఓటర్లను కలుసుకుంటూ పార్టీ విధానాలు, అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల మద్దతు, ఆశీర్వాదంతో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా, కర్నాటి వెంకట నారాయణరెడ్డి సతీమణి అయిన విజయకుమారి వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ






సమస్యల పరిష్కారం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

ఈ ప్రచార కార్యక్రమంలో దొడ్డా కృష్ణారెడ్డి, కొల్లేటి నరసింహారావు, వెంకటనారాయణరెడ్డి, గోపాల్, కృష్ణంరాజు, సత్యం, లక్ష్మీ, జీకే రెడ్డి, ప్రదీప్, సందీప్, వెంకటేశ్వరరావు, కోలేటి జమలమ్మ, కోలేటి తులసి, పరసా రాధా, మస్తాన్, బాజీ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో “హస్తం” గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను విజయకుమారి కోరారు. వార్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి మాట కాదు.. బాధ్యత.!

- 20వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కమల్ పాషా హామీ.

**సత్తుపల్లి, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి కమల్ పాషా అభివృద్ధిపై గట్టి హామీ ఇచ్చారు. “నేను మీలో ఒకడిని... మీ ఇంటి బిడ్డను” అంటూ ఇంటింటి ప్రచారంలో పాల్గొంటూ ప్రజల ఆశీర్వాదం కోరుతున్నారు. సందర్భంగా కమల్ పాషా మాట్లాడుతూ, వార్డు ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణం, మెరుగైన సైడ్ డ్రైనేజీ వ్యవస్థ, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదవారికి రేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాల మంజూరుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యను గుర్తించి, తన సొంత ఖర్చులతో కరెంటు పోల్స్ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఇది తన సేవాభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. 20వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దే అవకాశం ఇవ్వండి అంటూ ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కమల్ పాషా ఓటర్లను కోరారు.





ఈ ప్రచార కార్యక్రమంలో సీనియర్ నాయకులు అలవాల కరుణాకర్, రాయల కోటేశ్వరావు, గజ్జల శీను సంపత్, జూపాటి పాపారావు, ప్రణతి వెంకటేశ్వరావు, కొత్తపల్లి శివతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# 6వ వార్డులో బీజేపీ ప్రచార హోరు

- పులిచెర్ల స్వాతి గెలుపే లక్ష్యంగా విస్తృత పర్యటన

**సత్తుపల్లి, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి పట్టణంలోని 6వ వార్డులో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పులిచెర్ల స్వాతి గెలుపు కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధి ప్రణాళికలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి నుంచి వందల కోట్ల రూపాయల నిధులు వస్తున్నా సత్తుపల్లికి తగిన అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా పట్టణ పరిస్థితి మారలేదని, ఇది ప్రజలపై జరిగిన అన్యాయమని





పేర్కొన్నారు.
బీజేపీకి అవకాశం ఇస్తే ప్రతి రూపాయి ఖర్చుకు లెక్క చూపిస్తామని, సింగరేణి నిధులను ప్రజల అభివృద్ధికే వినియోగిస్తామని హామీ ఇచ్చారు. సత్తుపల్లిని తెలంగాణలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. యువత ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, సింగరేణి నిధులతో పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. విద్యా రంగంలో కేంద్రీయ విద్యాలయం, టెక్నికల్, పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీఐ, స్కిల్ అకాడమీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైద్య రంగంలో మెడికల్ కాలేజ్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు.
మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా రైల్వే లైన్, అన్ని మండలాలకు రోడ్లు, 24 గంటల నీటి సరఫరా, స్మార్ట్ సిటీ తరహా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. రైతుల కోసం రైతు బజార్, కోల్డ్ స్టోరేజ్ కేంద్రాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయటపడేయాలి

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,ఫిబ్రవరి4(తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోందని, రైతు కుటుంబాలు అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. సిచువేషన్ అసెస్మెంట్ సర్వే 2018-19 గణాంకాలు ఈ పరిస్థితిని స్పష్టంగా చూపుతున్నాయని అన్నారు.సర్వే ప్రకారం రాష్ట్రంలో ఒక్కో రైతు కుటుంబంపై సగటున రూ.1,52,113 అప్పు ఉన్నట్లు తెలిపారు. జాతీయ సగటు రైతు కుటుంబ నెలసరి ఆదాయం రూ.10,218 కాగా, తెలంగాణ రైతు కుటుంబాల సగటు ఆదాయం రూ.9,403గా ఉన్నట్లు వివరించారు.రాష్ట్రంలో 91 శాతం రైతు కుటుంబాలు అప్పుల్లో ఉన్నాయని, 95 శాతం మంది సన్న, చిన్న, మధ్యతర రైతులేనని చెప్పారు. సరైన ఆదాయం లేకపోవడం, పంటలు గిట్టుబాటు కాకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.రైతుల ఆదాయం పెంచేందుకు కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా కూరగాయల సాగు, డైరీ ఫార్మింగ్, కోళ్ల, గొర్రెల పెంపకం, ఆయిల్ పామ్, సెరికల్చర్, పప్పుదినుసులు వంటి



వ్యవసాయ అనుబంధ రంగాల వైపు దృష్టి సారించాలని సూచించారు.దీనికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ వ్యవసాయ విధానం ద్వారా రైతులకు స్థిర ఆదాయం సాధ్యమవుతుందని తెలిపారు. వరిని బియ్యంగా మార్చి మార్కెట్లో విక్రయించడం వంటి విలువ జోడింపు విధానాలు రైతులకు అదనపు లాభాలు అందిస్తాయని చెప్పారు.
వ్యవసాయం గిట్టుబాటుగా ఉండాలంటే నీటి లభ్యత కీలకమని, కృష్ణా, గోదావరి నదీ జలాలను ప్రతి ఎకరాకు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత రెండేళ్లుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు.వ్యవసాయానికి నీరు, నాణ్యమైన విత్తనాలు, సేంద్రియ ఎరువులు అవసరమని, అయితే అధికంగా యూరియా, క్రిమిసంహారక మందుల వినియోగం వల్ల భూసారంపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు.పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునేందుకు రైతులు ప్రతి సంవత్సరం భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాంతాలవారీగా అవసరమైన విత్తనాలు ముందుగానే సిద్ధం చేయాలని, ఆగ్రోస్ సంస్థ ద్వారా వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు సన్నకారు రైతులకు అద్దెకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ చర్యలు రైతు కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసి, అప్పుల భారంనుంచి బయటపడేందుకు దోహదపడతాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎస్సీ విద్యార్థుల ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ నమోదు వేగవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందించేందుకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన సూచించారు.
బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి





విజయ కుమారి, ఎల్‌డీఎం శివ ప్రసాద్ తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ నమోదు కోసం ఎస్సీ విద్యార్థులకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. నమోదు నుంచి ధృవీకరణ పత్రాల జారీ వరకు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సంబంధిత తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.విద్యార్థులకు బ్యాంకు లేదా పోస్టల్ ఖాతా తెరవడంలో మార్గనిర్దేశం చేయాలని సూచించారు. 10 సంవత్సరాలు నిండిన విద్యార్థుల పేరపై పోస్టాఫీస్‌లో రూ.100తో ఖాతా ప్రారంభించి స్కాలర్‌షిప్‌కు అనుసంధానం చేయవచ్చని, ఇందుకు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ ఉంటే సరిపోతుందని వివరించారు.జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ వర్గాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు అర్హులని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.5 లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, బోనఫైడ్ సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, బ్యాంక్ లేదా పోస్టల్ ఖాతా వివరాలతో https://www.tgepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు నమోదు చేసుకోవాలని సూచించారు.అనంతరం ప్రధానోపాధ్యాయుల సందేహాలకు అదనపు కలెక్టర్ సలహాలు, సూచనలు అందించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి,ఫిబ్రవరి4(తెలంగాణ ముచ్చట్లు):**

రానున్న మరో ఎనిమిది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని, నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వనపర్తి పట్టణంలోని 33వ, 24వ వార్డుల్లో మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా 33వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీలో ఉన్న మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్‌కు, అలాగే 24వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్న జయమ్మ-శ్రీనివాసులులకు తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవధిలోనే నిరుపేదల కోసం ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం సరఫరా, ఉచిత విద్యుత్తు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా వనపర్తి పట్టణంలో 50 కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం, 23 కోట్ల రూపాయల వ్యయంతో పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం వసతి గృహాల నిర్మాణం, రాజభవన్ పునరుద్ధరణ, గల్లీల్లో ఐమాస్ట్ లైట్ల ఏర్పాటు, గత పదేళ్ల పాలనలో మురికి కూపాలుగా మారిన కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి కాలనీలను సుందరంగా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఆయన స్పష్టం చేశారు.మరో ఎనిమిది సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగి వనపర్తిని అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్దలు, యువకులు, మహిళలు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రచార కమిటీ నియామకం

- వివరాలు వెల్లడించిన తుంబూరు దయాకర్ రెడ్డి
- కన్వీనర్ గా మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, కో కన్వీనర్లుగా బైరు హరినాథ్ బాబు, రామ్మూర్తి నాయక్ నియామకం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 4(తెలంగాణ ముచ్చట్లు ):**

ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల పర్వంలో కాంగ్రెస్ పార్టీ తమ ప్రచార వ్యూహాలకు పదును పెట్టింది. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలో పార్టీ ప్రచార కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక కమిటీని నియమించినట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి వెల్లడించారు.
ప్రచార కమిటీ కన్వీనర్‌గా మద్దినేని బేబి స్వర్ణకుమారిని, కోకన్వీనర్లుగా బైరు హరినాథ్ బాబు, రామ్మూర్తి నాయక్ లను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా కళ్ళెం వెంకటరెడ్డి, గోనె భుజంగ రెడ్డి, బానోత్ కిషోర్, గణపారపు వీరన్న,అంబటి సుబ్బారావు, వెంపటి రవి, అజ్మీర అశోక్ నాయక్, షేక్ హుస్సేన్ , బాధ్యతలు నిర్వహించనున్నారు. పార్టీ శ్రేణులను ఏకోన్ముఖులను చేస్తూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా ఈ కమిటీ కృషిచేయనుందని దయాకర్ రెడ్డి తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితుడికి అందజేసిన పరమేశ్వర్ రెడ్డి

**మల్లాపూర్, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**



నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2.5 లక్షల ఎల్ఓసీ చెక్కును బాధితుడికి పంపిణీ చేశారు. ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జి. రాము (మల్లాపూర్ శ్రీనికేతన్ స్కూల్ కారస్పాండెంట్ నరసింహ బావ) కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2,50,000/ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మందుముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో అండగా నిలవడం తమ బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అందించే సహాయం సకాలంలో అందేలా కృషి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ ఆర్థిక సహాయం రాము చికిత్సకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటూ, ఆయన త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి సద్గుణ్, మల్లాపూర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, నరసింహ, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.



# ఎల్లంపేట్‌లో అక్రమ మద్యం స్వాధీనం

**మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో మూడు మున్సిపాలిటీల, మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ ఎన్నికలు-2026 నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల నిబంధనలను అధికారులు కఠినంగా అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావల్‌కోల్ గ్రామంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది.తనిఖీల సందర్భంగా కె. సాయి కుమార్ (తండ్రి: పాండు) నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 12.72 లీటర్ల మద్యంను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసిన మద్యాన్ని స్థానిక ఎస్సై మన్మధ కొనారికి అప్పగించారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అక్రమ మద్యం నిల్వలు, రవాణా, పంపిణీపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



# మనిగిల్ల ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవాలపై చర్చ

**పెద్దమందడి,ఫిబ్రవరి4(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్వహించనున్న వార్షికోత్సవ కార్యక్రమాలపై ఉపాధ్యాయులు గ్రామ సర్పంచ్ తో పాటు చర్చ జరిగింది.ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య సార్, ఉపాధ్యాయులు రాములు , జానయ్య పాటు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ ముప్పూర్ గణేష్ కుమార్ల సమక్షంలో పాఠశాల వార్షికోత్సవాల నిర్వహణ, విద్యార్థులకు అవసరమైన వసతులు, అలాగే పాఠశాల అభివృద్ధి మరియు సమస్యలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా పాఠశాల ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఉపాధ్యాయులు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి సహకరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే విధంగా వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు గణేష్ బికె, సాయి తదితరులు పాల్గొన్నారు.



# నితిన్ నబిన్ బహిరంగ సభకు బయలుదేరిన పెద్దమందడి బీజేపీ నాయకులు

**పెద్దమందడి,ఫిబ్రవరి4(తెలంగాణ ముచ్చట్లు):**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విజయ సంకల్ప సభకు పెద్దమందడి మండల బీజేపీ అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరారు.నూతనంగా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా నితిన్ నబిన్ మహబూబ్‌నగర్ జిల్లాకు రావడం సందర్భంగా బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.ఈ సభలో ప్రస్తుతం జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య తెలిపారు.ఎన్నికల్లో విజయం సాధించేలా వ్యూహాలు సూచించడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేయడంపై జాతీయ అధ్యక్షుడు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్యతో పాటు మాజీ అధ్యక్షుడు కావలి తిరుపతయ్య, సీనియర్ నాయకులు యాదయ్య, శేఖర్ గౌడ్, చంద్రమౌళి, బాలరాజు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



## ప్రముఖ కవి ముగ్ధమ్ మొహిద్దిన్ 118వ జయంతి స్ఫూర్తి గ్రూప్ ఘన నివాళులు

**ఏ ఎస్ రావు నగర్, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖ కవి ముగ్ధమ్ మొహిద్దిన్ 118వ జయంతిని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం కమలానగర్ ఆఫీస్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరి రావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు గుమ్మడి హరిప్రసాద్, స్ఫూర్తి గ్రూప్ యువ నాయకులు బాలు ముగ్ధమ్ మొహిద్దిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్ఫూర్తి గ్రూప్ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో ముగ్ధమ్ మొహిద్దిన్ తుదకంటూ పోరాటం సాగించారని అన్నారు. కామ్రేడ్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి కార్మిక వర్గ హక్కుల కోసం ఉద్యమాలు చేశారని తెలిపారు. ఉర్దూలో అనేక గొప్ప రచనలు చేసి ప్రపంచ శాంతి కోసం జీవితాంతం కృషి చేశారని, ఆయన ఆశయాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.స్ఫూర్తి గ్రూప్ నాయకురాలు అనురాధ మాట్లాడుతూ, ముగ్ధమ్ మొహిద్దిన్ తనకు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. తమ తాత తెలంగాణ సాయుధ పోరాటంలో సుందరయ్య, ముగ్ధమ్ మొహిద్దిన్‌లకు కొరియర్‌గా పని చేశారని, ఆనాటి పోరాటాల కథలను వివరించే వారని తెలిపారు. అడవుల్లో పోరాట సమయంలో ముగ్ధమ్ మొహిద్దిన్‌కు తేలు కుట్టినప్పటికీ ఏమాత్రం భయపడకుండా ధైర్యంగా నిలబడ్డారని గుర్తు చేశారు. భాషా భేదాలు ఉన్నప్పటికీ బొమ్మల ద్వారా పరిస్థితిని అర్థం చేసుకుని అడవిలోని మూలికలతో వైద్యం చేసిన ఘటన ఆయన నిబ్బరాన్ని చాటుతుందని అన్నారు. అటువంటి మహానుభావుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.అనంతరం సభ్యులందరూ ముగ్ధమ్ మొహిద్దిన్ చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రోజా రాణి, శారద, అనురాధ, జయరాజ్, ఎం.భాస్కర్ రావు, కృష్ణమాచార్యులు, బంగారు ఆచార్యులు, వెంకటేశ్వరరావు, కోమటి రవి, బాలు, హరిప్రసాద్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## శుభ వేడుకలో పాల్గొన్న టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్–2843) జిల్లా నాయకులు

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు)**

టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్-2843) ఖమ్మం జిల్లా నాయకులు స్థానికంగా నిర్వహించిన ఓ శుభ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జిల్లా ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ అక్క కంభం శ్రీదేవి, బావ కంభం రాము నివాసంలో మేనల్లుడు శ్రీనివాస్, మేనకోడలు ఝావేరిల పంచెకట్టు-ఓణీల శుభ కార్యక్రమానికి జిల్లా నాయకులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించిన నాయకులు, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి శుభ సందర్భాలు కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయని, ఆనందాన్ని పరస్పరం పంచుకునే అవకాశం కల్పిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, టీబీజేపీ ఖమ్మం నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, నగర కోశాధికారి కప్పల మధు, వనం నరేష్, పొదిలపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్కతుర్తి అంబేద్కర్ సర్కిల్‌లో ఆర్టీసీ బస్సుల ఢీ

- **డ్రైవర్ల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ప్రయాణికుల ఆరోపణ**

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ (చౌరస్తా) వద్ద హనుమకొండ డిపో, సిరిసిల్ల డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు పరస్పరం ఢీకొన్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంతో బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎల్కతుర్తి చౌరస్తా ప్రాంతంలో ఇటువంటి రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతుండటంతో స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చౌరస్తాలో ట్రాఫిక్ ఆంక్షలకు సంబంధించిన సూచిక బోర్డులు, హెచ్చరిక సంకేతాలు లేకపోవడం కూడా ప్రమాదాలకు దారితీస్తోందని స్థానికులు పేర్కొన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు డ్రైవర్లకు సరైన అవగాహన, మార్గనిర్దేశం కల్పించకపోవడమే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణమని ఎల్కతుర్తి మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సదుద్దేశంతో ఎల్కతుర్తి సర్కిల్‌ను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసినప్పటికీ, డ్రైవర్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు కొనసాగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత డిపో మేనేజర్లకు పలుమార్లు సమాచారం అందించినప్పటికీ, బస్టాండ్‌లో నిలపాల్సిన బస్సులను రోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించడం, దించడం, రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేయడం వంటి అవకతవకలు కొనసాగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు చేపట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైవర్లకు సరైన మార్గనిర్దేశకాలు ఇవ్వడంతో పాటు కఠిన చర్యలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నివారించాలని, ఆర్టీసీ సంస్థ ప్రతిష్ఠను కాపాడడంతో పాటు ప్రజల ప్రాణాలను రక్షించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# పులిపాటి నగర్‌లో యుగంధరుడి సందడి

- **పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్" కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 4(తెలంగాణ ముచ్చట్లు)**



పులిపాటి నగర్ లో "యుగంధరుడు" సందడి చేశారు. పులిపాటి నగర్ వాసులతో మమేకమై ఆద్యంతం ఆనందం పంచారు. "డాక్టర్ పులిపాటి వెల్ఫేర్ అసోసియేషన్" కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి మంగళవారం సాయంత్రం తుమ్మల తనయుడు యుగంధర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఖమ్మం నగరం గొల్లగూడెం రోడ్డులోని డాక్టర్ పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కొలువుదీరింది. ఈ సందర్భంగా విచ్చేసిన తుమ్మల యుగంధర్‌కు పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఘన స్వాగతం లభించింది. పురోహితుల వేద మంత్రాల నడుమ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణ సాక్షిగా పూలవర్షంతో ఆయనను పులిపాటి నగర్ లోకి ఆహ్వానించారు. అలాగే వివిధ మతాధిపతుల సమక్షంలో యుగంధర్ ను ఆశీర్వదించి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గజ మాలతో శాలువాలతో ఆయనను ఘనంగా సత్కరించి బర్త్ డే కేకును కట్ చేయించారు. పులిపాటి ప్రసాద్ సతీమణి పద్మప్రియ కుమార్తెలు శ్రీ వైష్ణవి శ్రీలేఖ్యతో పాటు ఇతర కుటుంబ సభ్యులు యుగంధర్ ను సాదరంగా ఆహ్వానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో యుగంధర్ పాల్గొని మారేడు చెట్టును నాటి పులిపాటి నగర్ లో తన పుట్టిన రోజు జ్ఞాపకాన్ని పదిలం చేసుకున్నారు.

**మినీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించిన తుమ్మల తనయుడు**

పులిపాటి నగర్ లో అత్యంత అధునాతన సౌకర్యాలతో నిర్మించిన పులిపాటి టవర్స్ లో అన్ని హంగులతో నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్ ను తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ లాంఛనంగా ప్రారంభించారు. సకల వసతులతో నిర్మించిన ఈ మినీ ఫంక్షన్ హాల్ ను తిలకించిన యుగంధర్ మంత్రముగ్ధుడయ్యారు.



అలాగే టవర్స్ లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్క్ ను ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఇక ఓపెన్ జిమ్ ను గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర నేత ఏలూరి శ్రీనివాసరావు ప్రారంభించగా వాటర్ ప్లాంట్ ను నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి వాకింగ్ ట్రాక్ ను ఖమ్మం నగర డిప్యూటీ మేయర్ జోహారా ఫాతిమా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిరుమామిళ్ల నాగేశ్వరరావు, బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**పులిపాటితో నాది చిన్ననాటి అనుబంధం తుమ్మల యుగంధర్**

డాక్టర్ పులిపాటి ప్రసాద్ తో తనకు చిన్ననాటి నుంచే అనుబంధం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ ఉద్ఘాటించారు. తుమ్మలతో అత్యంత సాన్నిహిత్యంగా ఉండే పులిపాటి తానను కూడా ఎంతో ఆప్యాయంగా పలకరించే వారని తన అనుభవాన్ని పంచుకున్నారు. పులిపాటి నగర్ పేరుతో నిర్మించిన ఈ కాలనీ అభివృద్ధి కోసం ఏర్పాటైన "పులిపాటి వెల్ఫేర్ అసోసియేషన్" నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా యుగంధర్ అభినందించారు. పులిపాటి నగర్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురాగానే పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తానని స్పష్టం చేశారు. పులిపాటి ప్రసాద్ అనేక రూపాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి వ్యక్తిగత ఆంతరంగికుడిగా పని చేసిన అనుభవం పులిపాటికే దక్కిందని ప్రశంసించారు. ఆ తర్వాత తుమ్మల సహచర్యంతో పార్టీలో అనేక పదవులు ఎంతో నిబద్ధతగా నిర్వహించారని గుర్తు చేశారు. ఈ క్రమంలో పులిపాటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

**అవార్డుల ఘనాపాటి మన పులిపాటి -ఖమ్మం నగర మేయర్ కునుకొల్లు నీరజ**

దేశ ప్రధానమంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రితో సహా అనేక మంది ప్రముఖుల చేత అవార్డులను పొందిన ఘనాపాటి మన పులిపాటి ప్రసాద్ అని ఖమ్మం నగర మేయర్ కునుకొల్లు నీరజ అభినందించారు. కళాశాలల నిర్వహణతో పాటు మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పులిపాటి ప్రజలకు మరింత చేరువయ్యారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆయన చేపట్టే సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో చేపట్టే సేవా కార్యక్రమాలకు తన వంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు .

**పులిపాటి రాజకీయంగా ఎన్నో కష్టనష్టాలను చవిచూశారు.. టీజీవో రాష్ట్ర నేత ఏలూరి శ్రీనివాసరావు**

డాక్టర్ పులిపాటి ప్రసాద్ రాజకీయంగా ఎన్నో కష్ట నష్టాలను చవి చూశారని టీజీవో రాష్ట్ర నేత ఏలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్టీఆర్ వద్ద పని చేసిన అనుభవం కలిగిన పులిపాటి ఆ తర్వాత ఎన్నో ఒడిదుడుకులను చవి చూశారని గుర్తు చేశారు. తనకు ఎంతో కాలంగా ఆయనతో సాన్నిహిత్యం ఉందని, తను రాజకీయంగా పడిన ఇబ్బందులను గమనిస్తూ ఉండేవాడినని తెలిపారు. ముఖ్యంగా గడిచిన పదేళ్ల కాలంలో పులిపాటిని రాజకీయంగా ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని వివరించారు. అకారణంగా తనను, పులిపాటిని ఇబ్బంది పెట్టినవారు ఇవాళ రాజకీయంగా మనుగడలో లేకుండా పోయారని గుర్తు చేశారు. పులిపాటికి తాను ఎప్పటికీ అండదండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

**పేద విద్యార్థుల పెన్నిధి పులిపాటి.. డిప్యూటీ మేయర్ జోహారా ఫాతిమా**

పులిపాటి విద్యా సంస్థలను స్థాపించి ఎందరో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించిన డాక్టర్ పులిపాటి ప్రసాద్ పేదల పెన్నిధిగా పేరుగాంచారని ఖమ్మం నగర డిప్యూటీ మేయర్ జోహారా ఫాతిమా కొనియాడారు. ఆయన తన విద్యా సంస్థలను సేవాభావంతో నెలకొల్పడం విశేషమని అభినందించారు. ఓవైపు రాజకీయాల్లో క్రియాశీలకంగా పని చేస్తూ మరో వైపు విద్యా సంస్థల అధినేతగా పులిపాటి పేరు గడించడం సాధారణ విషయంకాదని తెలిపారు.

**మా కుటుంబ శ్రేయోభిలాషి పులిపాటి.. ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ చౌదరి**

డాక్టర్ పులిపాటి ప్రసాద్ మా కుటుంబ శ్రేయోభిలాషి అని ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి గుర్తు చేసుకున్నారు. పులిపాటి టవర్స్ లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను ఈ సందర్భంగా దీపక్ ప్రారంభించారు. రాజకీయాల్లో ఉన్నత విలువలను కొనసాగిస్తూ నేటికీ అదే విలువలతో సమాజంలో మంచి పేరు తెచ్చుకున్న ఘనతను పులిపాటి సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. మేమిద్దరం విభిన్న రాజకీయ పార్టీల్లో క్రియాశీలకంగా పని చేస్తున్నప్పటికీ రాజకీయంగా అనేక సలహాలు, సూచనలు ఇచ్చేవారని గుర్తు చేశారు. రాజకీయంగా, విద్యా సంస్థల అధినేతగా భవిష్యత్తులో పులిపాటి మరింత ఎత్తుకు ఎదగాలని దీపక్ చౌదరి ఆకాంక్షించారు.

**అభివృద్ధి, ఐకమత్యమే ఎజెండాగా పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్.. డా.పులిపాటి ప్రసాద్**

పులిపాటి నగర్ ప్రాంత అభివృద్ధితోపాటు ఈ ప్రాంతంలో నివశించే ప్రజల ఐకమత్యమే ప్రధాన ఎజెండాగా పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ రూపుదిద్దుకుందని డాక్టర్ పులిపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధిని సైతం ఆకాంక్షిస్తూ ఈ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాచరణలు రూపొందిస్తుందని తెలిపారు. 320 కుటుంబాలు కలిగిన పులిపాటి నగర్ శ్రేయస్సు కోసం 32 మంది సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కుల, మత, రాజకీయ వ్యత్యాసంతో పని లేకుండా సామాజిక సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రభుత్వపరమైన అభివృద్ధికి సహకరించడం, పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నాటడం, సమాజంలో నైతిక విలువలను పెంపొందించడం, ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ సిటిజన్లు, వికలాంగులకు సేవ చేయడం వంటి మహోన్నత కార్యక్రమాల కూర్పుతో "పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్" ఏర్పడిందని వివరించారు. రాజకీయాలకు అతీతంగా, కుల, మత వర్గాలతో ప్రమేయం లేకుండా ఈ వెల్ఫేర్ అసోసియేషన్ పని చేస్తుందని, ఇందుకు ప్రతి ఒక్కరు తమ సహాయ సహకారాలు అందించాలని పులిపాటి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**పులిపాటి ప్రసాద్ గౌరవాధ్యక్షుడిగా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం..**

డాక్టర్ పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కొలువుదీరింది. పులిపాటి ప్రసాద్ గౌరవ అధ్యక్షుడిగా కొలువైన ఈ కార్యవర్గం 32 మంది సభ్యులతో తన కార్యకలాపాలను ప్రారంభించేందుకు ప్రమాణ స్వీకారం చేసింది.ఖమ్మం పట్టణ కాంగ్రెస్ ప్రముఖ నాయకులు
యల్నాటి కోటేశ్వరరావు స్వాగతోపన్యాసంతో ప్రారంభించ బడింది. అసోసియేషన్ ప్రెసిడెంట్ గా పట్నాయక్ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఊరుకూరి మాధవరావు, కోశాధికారిగా మాశెట్టి వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా మేడ వెంకటేశ్వరరావు, వీరారెడ్డి ఎంపికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా బైరెడ్డి శ్రీలత రెడ్డి, బుద్ధ శ్రీకాంత్, పి సత్యనారాయణ, జొన్నలగడ్డ రమా తులసి, మందడపు శ్యామలాదేవి, ముక్కపాటి నిర్మల, చెరుకుమల్ల రవి, చెరుకూరి సందీప్, దీనా రాణి, సీహెచ్ వీరభద్రం, వెంకటేశ్వర రెడ్డి తదితరులతో కూడిన నూతన కార్యవర్గం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేసింది.

**విజేతలకు బహుమతులు..**

సంక్రాంతి పండుగ సందర్భంగా పులిపాటి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. క్రీడా పోటీలు మానసిక, శారీరక సమతుల్యతను కాపాడతాయని తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. అనంతరం పులిపాటి విద్యా సంస్థల పిల్లల చేత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఖమ్మం పౌరసమితి ప్రముఖులు ఖాదర్ బాబా, గోళ్ళ రాధాకృష్ణ, గుమ్మడివెల్లి శ్రీనివాస్, పోలీసు వెంకన్న, అడ్వకేట్ హైమవతి, కీసర పద్మజారెడ్డి, కొదుమూరి జగన్నాథం, సిద్ధంశెట్టి శ్రీకాంత్ అనంతరెడ్డి, కాజా వెంకటేశ్వరావు, కోదుమూరి భద్రయ్య, బాణాల లక్ష్మణ్, పాలకుర్తి నాగేశ్వర రావు, మజీద్, ఖమ్మం పుర ప్రముఖులు, అత్యధిక సంఖ్యలో ఆ ప్రాంత ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.


# పాముకు పాలు పోశాం.. అది విషం కక్కింది!

- **బీఆర్ఎస్ 'రంగుల' మోసాలపై పొంగులేటి నిప్పులు**
- **ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు?**
- **కల్లూరు గడ్డపై 'గులాబీ' గూండాయిజం సాగనివ్వం!**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 4(తెలంగాణ ముచ్చట్లు )**



చందాలకి.. దందాలకి ఇక సెలవు!



"అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేని అసమర్థులు.. ఇప్పుడు రంగురంగుల కండువాలు వేసుకుని మాయ మాటలతో వస్తున్నారు. గతంలో మనం ఒక వ్యక్తిని నమ్మి గెలిపించుకుంటే.. పాముకు పాలు పోసినట్లు అయ్యింది. ఆ పాము ఇప్పుడు విషం కక్కుతోంది!" అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై ధ్వజమెత్తారు. బుధవారం కల్లూరు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన ప్రసంగం విపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది.

**సొల్లు పురాణాలు చెప్తే సరిపోతుందా?**

వార్డుల్లోకి వస్తున్న బీఆర్ఎస్ నాయకులను నిలదీయాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు. "మీ దగ్గర ఎమ్మెల్యే లేడు, మంత్రి లేడు, పోనీ నిధులు తెచ్చేందుకు ముఖ్యమంత్రి లేడు. మరి ఏముందని ప్రగల్భాలు పలుకుతున్నారు? ఎలా అభివృద్ధి చేస్తారో ప్రజలకు స్పష్టంగా చెప్పండి" అని సవాల్ విసిరారు. మభ్యపెట్టే మాటలు, సొల్లు పురాణాలు చెప్పి ఓట్లు కొల్లగొట్టాలని చూస్తే కల్లూరు ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

గత ప్రభుత్వంలో సాగిన చందాల, దందాల రాజకీయాలకు ఈ గడ్డపై ఇక స్థానం లేదని మంత్రి స్పష్టం చేశారు. విపక్ష నాయకులు, వారి తొత్తులు అహంకారంతో మాట్లాడుతున్నారని, వారి అహంకారాన్ని అణిచివేయాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. "ఇది నా గడ్డ.. నా ఊరు. ఇక్కడ పుట్టి పెరిగిన వాడిగా చెప్తున్నా.. అభివృద్ధి చేసే సత్తా నాకుంది. చేతకాని వారు పగటి కలలు కంటున్నారు" అని ఎద్దేవా చేశారు.

**అసమర్థులకు బుద్ధి చెప్పే విప్లవం..**

20కి 20 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా బీఆర్ఎస్ అసమర్థతకు చరమగీతం పాడాలని మంత్రి పిలుపునిచ్చారు. నాయకులు రానక్కర్లేదని, ప్రజలే ఒక విప్లవంలా కదిలి హస్తం గుర్తుకు ఓటు వేసి విపక్షాల అడ్రస్ గల్లంతు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ | తెలుగు దిన పత్రిక



# మంచి ఉన్నంత కాలమే మర్యాద.. లేదంటే యుద్ధమే!





**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 4(తెలంగాణ ముచ్చట్లు)**

## శక్తి ఇచ్చారు.. అభివృద్ధి చేసి చూపిస్తా!

**ఏదులాపురం మున్సిపాలిటీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం : మంత్రి పొంగులేటి**

"రాష్ట్రంలో మన ప్రభుత్వం ఉంది.. మీ శ్రీనన్న మంత్రిగా కీలక స్థానంలో ఉన్నాడు. మీ దీవెనలతో ఏదంటే అది చేయగలిగే శక్తి నాకు వచ్చింది.. ఇక అభివృద్ధి చేసి చూపిస్తా" అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 10, 11, 28, 29, 30 వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత పాలకుల తీరుపై నిప్పులు చెరిగారు.

**రావణ కాష్టాన్ని పారద్రోలారు..**

రాష్ట్ర ప్రజలు పదేళ్ల 'రావణాసుర' పాలనను అంతం చేసి, ప్రజా పరిపాలనను తెచ్చుకున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. "మంచి ఉన్నంత కాలమే మర్యాద ఉంటుంది.. అది లేనప్పుడు యుద్ధం చేయాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, పేదల ఇళ్ల కంటే దొరల ఇళ్లకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. కనీసం హాస్టల్ విద్యార్థులకు సరిగ్గా అన్నం పెట్టలేని వారు నేడు కబుర్లు చెబుతున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని కోరారు.

**పార్టీ రంగులు చూడబోం..**
**పేదరికమే ప్రామాణికం**

సొంతింటి కల నెరవేర్చే విషయంలో రాజకీయాలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు. "మీరు ఏ పార్టీకి ఓటు వేశారనేది నాకు అనవసరం. మీరు అర్హులైన పేదవాళ్లయితే చాలు.. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తీరుతాం" అని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని, వచ్చే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేస్తామని వెల్లడించారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు వంటి వాటితో నేడు ప్రతి ఇల్లూ సంతోషంగా ఉందన్నారు.

**పెద్ద కొడుకుగా బాధ్యత నాది..**

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక మేటి (రోల్ మోడల్) మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. "మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ సమస్యలన్నీ తీరుస్తాను. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాను" అని భరోసా ఇచ్చారు. మాటలు చెప్పే వారిని కాకుండా, పని చేసే వారిని గుర్తించాలని ప్రజలను కోరారు.

**డిపాజిట్లు రాకుండా బుద్ధి చెప్పండి**

ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో ప్రత్యర్థులకు డిపాజిట్లు రాకుండా బుద్ధి చెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థులు తుమ్మల బిక్షం (10వ వార్డు), పేరం వెంకట లక్ష్మి (11వ వార్డు), నూకల రామ్మోహన్ రెడ్డి (28వ వార్డు), వెంపటి ఉమ (29వ వార్డు), కొట్టం శిరీష (30వ వార్డు)లను హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

# బొగ్గు రవాణాతో వరంగల్ జిల్లాలో పర్యావరణ,ప్రజారోగ్య సమస్యలపై ప్రభావం

- **లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎంపీ కడియం కావ్య**

**వరంగల్, ఫిబ్రవరి04(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లాలో బొగ్గు రవాణా కారణంగా ఏర్పడుతున్న పర్యావరణ,ప్రజారోగ్య సమస్యలపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బొగ్గు రవాణా మరియు దానికి అనుబంధ లాజిస్టిక్స్ వల్ల రహదారి, రైలు మార్గాల్లో కాలుష్యం పెరుగుతోందా? వరంగల్ జిల్లాపై దాని ప్రభావం ఎంత మేరకు ఉందో అధ్యయనం నిర్వహించారా? దుమ్ము కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రజల భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరాలు ఇవ్వాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిని కోరారు.

ఈ ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వరంగల్‌కు సమీపంలోని బొగ్గు గనులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి ప్రాంతంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధీనంలో ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ సుమారు నాలుగు వేల టన్నుల బొగ్గును భూపాలపల్లి గనుల నుంచి ఉప్పల్ రైల్వే సైడింగ్‌కు రహదారి మార్గంలో టార్పాలిన్ కవర్లు వేసిన లారీల ద్వారా సుమారు యాభై ఆరు కిలోమీటర్ల మేర తరలిస్తున్నట్లు వివరించారు.

బొగ్గు రవాణా ప్రభావాలపై పర్యావరణ పరిరక్షణ శిక్షణ మరియు పరిశోధనా సంస్థ ద్వారా గాలి నాణ్యత, శబ్ద కాలుష్యం, నీటి నాణ్యత, సామాజిక అంశాలపై అధ్యయనాలు నిర్వహించామని, ట్రాఫిక్ ప్రభావ అంచనా నివేదికలు కూడా సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. పర్యావరణ అనుమతుల నిబంధనలు, కేంద్ర పర్యావరణ శాఖ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలను పాటిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి పర్యావరణ అనుసరణ నివేదికలు సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు భద్రత దృష్ట్యా డ్రైవర్లకు శ్వాస పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేంద్రం ఇచ్చిన సమాధానంపై స్పందించిన ఎంపీ కడియం కావ్య, క్షేత్రస్థాయిలో వరంగల్ ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులకు ఈ చర్యలు సరిపోతాయా అని ప్రశ్నించారు. బొగ్గు లారీల రాకపోకల వల్ల గ్రామాలగుండా దుమ్ము మబ్బుల్లా ఎగసిపడుతోందని, చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం నివేదికలకే పరిమితం



కాకుండా, వాస్తవంగా దుమ్ము కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సర్పంచ్ బిల్లా యాదగిరి

**వేలేరు, ఫిబ్రవరి04(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత, నాణ్యత అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొత్తం 294 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ప్రధానోపాధ్యాయులు సత్తయ్య వివరించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం ప్రభుత్వ నిబంధనలు, నియమావళి ప్రకారం ఉండాలని, పోషకాహారం సమృద్ధిగా అందేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. భోజనం తయారీ విధానం, పదార్థాల నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.





భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్న సర్పంచ్, వారికి అందుతున్న ఆహారంపై అభిప్రాయాలు సేకరించారు. కొంతమంది విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం సమయానికి అందుతోందా, రుచి, పరిమాణం సరిపోతున్నాయా అనే అంశాలను తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణపై రాజీ పడకుండా బాధ్యతగా పని చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు



తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందితేనే వారి ఆరోగ్యం మెరుగుపడి, విద్యపై ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిరంతరం పర్యవేక్షణలో ఉండాలని, ఎలాంటి లోపాలు లేకుండా అమలు చేయాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో వేలేరు గ్రామ ఉపసర్పంచ్ శ్రీకర్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం రద్దు గిరిజనుల పాలిట గొడ్డలి పెట్టు రౌండ్

- **రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజన సంఘాల హెచ్చరిక**

**హైదరాబాద్,ఫిబ్రవరి04(తెలంగాణ ముచ్చట్లు):** సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం రద్దు వల్ల గిరిజనులపై పడే ప్రభావంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోహన్ సింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బస్కీ నాయక్, రాష్ట్ర కార్యదర్శి విష్ణు నాయక్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో గ్రామీణ పేదల జీవన భద్రత కోసం 2005లో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కుల చట్టాలు సామాన్య ప్రజల జీవితాల్లో కీలక మార్పులు తీసుకొచ్చాయని వక్తలు గుర్తు చేశారు. ముఖ్యంగా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం, ఆకలి, వలసలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో మార్పులు చేస్తూ, కేంద్ర-రాష్ట్ర నిధుల వాటాను 90:10 నిష్పత్తి నుంచి 60:40కి మార్చి 'విబి-జి రామ్ జి చట్టం 2025' పేరుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపుతోందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 33 కోట్ల జాబ్ కార్డులు ఉండగా, రాష్ట్రంలో సుమారు 65 లక్షల మంది ఈ పథకంపై ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్ల గ్రామీణ పేదలకు పనిదినాలు తగ్గుతున్న తరుణంలో ఉపాధి హామీ పనులు వారికి ఆధారంగా మారాయని తెలిపారు. ఆ పనుల ద్వారా



వచ్చే ఆదాయంతో వైద్యం, పిల్లల చదువు, పోషకాహారం వంటి మౌలిక అవసరాలు తీర్చుకుంటున్నారని వివరించారు.

రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉన్న సమయంలో 40 శాతం వాటా భరించడం ఆచరణ సాధ్యం కాదని, దీంతో ఉపాధి హామీ పథకం నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని వక్తలు హెచ్చరించారు. ఈ మార్పుల వెనుక కార్పొరేట్ ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆరోపించారు.

ఈ సందర్భంగా మోహన్ సింగ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు నిలిచిపోతే గిరిజనుల్లో పేదరికం మరింత పెరిగి, విద్య, వైద్యం అందని దూరంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర నిధుల వాటాను మళ్లీ 90 శాతానికి పెంచి, రాష్ట్రాల వాటాను 10 శాతానికి పరిమితం చేయాలని, అలాగే ఉపాధి హామీ పనిదినాలను 125 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న నిర్వహించనున్న సంఘాల ధర్నా కార్యక్రమాలకు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మద్దతు ప్రకటించింది.

# ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ సమీపంలో విస్తృత వాహన తనిఖీలు

- **డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా**

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 04 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం సాయంత్రం విస్తృత స్థాయిలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్సై ఏ. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ ఉబేదుల్లా ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ, ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులపై ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, వేగ నియంత్రణ పాటించడం, ట్రాఫిక్ నిబంధనలు గౌరవించడం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయరాదని పోలీసులు సూచించారు. నిబంధనలు



ఉల్లంఘించిన పలువురు వాహన చోదకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని జరిమానాలు విధించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ ఉబేదుల్లా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అత్యవసరమని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఇలాంటి వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. పోలీస్ శాఖ చేపడుతున్న ఈ చర్యలతో ఎల్కతుర్తి మండల కేంద్రంలో రోడ్డు భద్రత మరింత మెరుగుపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు



# బిజెపి బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలి

- **బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్**

**స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి04(తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో బిజెపి బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో బిజెపి బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి పాలకుర్తి రాధిక సోమశేఖర్‌కు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఎన్నికల ప్రభారి దొంతి దేవేందర్ రెడ్డి, ఎన్నికల ఇంచార్జి నవ్య రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ ఇనుగాల యుగేందర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో భాగంగా స్థానిక సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి, మున్సిపాలిటీ అభివృద్ధికి బిజెపి అభ్యర్థుల గెలుపు అవసరమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# సేవా కార్యక్రమాలతో యుగంధర్ జన్మదినం

- ప్రభుత్వ ఆసుపత్రి, వృద్ధాశ్రమంలో కార్యక్రమాలు.
- రక్తదాన శిబిరం, అన్నదానంతో సేవా భావం చాటిన అభిమానులు.

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు బుధవారం ఖమ్మం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో డా. రాంప్రసాద్, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రయ సేవా సొసైటీ, యుగంధర్ అభిమానుల ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలు, తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేసి సేవా భావాన్ని చాటారు.

అలాగే 55వ డివిజన్ కార్పొరేటర్ మోతారపు సుధాకర్ ఆధ్వర్యంలో ఖమ్మం మున్సిపాలిటీ నూతన భవనం సమీపంలోని వృద్ధ అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం, పండ్ల పంపిణీ నిర్వహించి జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమాల్లో కిరణ్, రమేష్, కృష్ణ, రాజు తదితరులతో పాటు ముఖ్య నాయకులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సర్పంచ్ జోడుముంతల కిరణ్

- మధ్యాహ్న భోజన పథకం,
- ఉపాధ్యాయుల,విద్యార్థుల హాజరు పరిశీలన



**కమ్మరిపేట, ఫిబ్రవరి04(తెలంగాణ ముచ్చట్లు):** కమ్మరిపేట ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, కమ్మరిపేట సర్పంచ్ జోడుముంతల కిరణ్ పరిశీలించారు. పాఠశాలలో విద్యా బోధన, హాజరు వివరాలపై సంబంధిత ఉపాధ్యాయులతో చర్చించారు.ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, బోధన జరుగుతున్న తరగతుల పరిస్థితిని పరిశీలించి, విద్యార్థులకు నిరంతరంగా నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విధుల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు.

అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజన నాణ్యత, పరిశుభ్రత, పరిమాణంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోషకాహారం అందేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిలుపూరి సూర్యనారాయణ పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి గ్రామస్థాయిలో అవసరమైన సహకారం అందిస్తామని వారు తెలిపారు.

# బీఆర్ఎస్ హయాంలోనే సత్తుపల్లి అభివృద్ధి

- 5వ వార్డులో కోనేటి అనురాధ గెలుపు కోరిన సండ్ర వెంకట వీరయ్య.





**సత్తుపల్లి, ఫిబ్రవరి 4 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. పట్టణంలోని 5వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కోనేటి అనురాధ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సత్తుపల్లి నియోజకవర్గంలో విస్తృత అభివృద్ధి జరిగిందని అన్నారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి వంటి కీలక అభివృద్ధి పనులన్నీ బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. దళితులకు రూ.12 లక్షలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. అలాగే కేసీఆర్ పెంచిన పెన్షన్లు తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏ హామీని అమలు చేయలేదన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 5వ వార్డు నుంచి కోనేటి అనురాధ బరిలో ఉన్నారని తెలిపిన సండ్ర వెంకట వీరయ్య, ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి ఆమెను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# అమ్మా చేతి గుర్తుకు ఓటేసి గెలిపించండి

**ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పిలుపు**



**మహబూబాబాద్, ఫిబ్రవరి04(తెలంగాణ ముచ్చట్లు):** పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల తరపున పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేపట్టి స్థానిక ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. మీకు అండగా తాను ఉంటానని చెబుతూ, అమ్మా చేతి గుర్తుకు మద్దతు ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు.ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తొర్రూర్ పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నువ్వు నీలోనే వున్నావు!

ఏడ్పించడానికి మన చుట్టు జనాలు కాచుకునే వున్నారు..
నువ్వు మాత్రం మనస్ఫూర్తిగా నవ్వడానికే ధైర్యం చూపించు.
వచ్చేవాళ్ళు వస్తుంటారు, వెళ్ళే వాళ్ళు వెళ్తుంటారు వెళ్ళనీ..
నీకోసం ఆగే వాళ్ళని మాత్రం ప్రేమించు.

వాట్సాప్, ఇంస్టా జనరేషన్ డ్యూడ్స్..
రంగులద్దుకున్న మొహాల మధ్య
మట్టి మనుషులు దొరకడం చాలా అరుదు..
ప్రపంచం అంత కనిపిస్తుంది కదా అని
నిన్ను నువ్వు గూగుల్లో సెర్చ్ చేసి వెతక్కు..
నీలోనే వున్నావు నువ్వు.. నీకోసం బతుకు...

చచ్చాక వచ్చే ఇన్స్యూరెన్స్ కోసం
బతుకునంత తాకట్టు పెడ్తున్న చోట..
చివరి క్షణాల్లో గుర్తొచ్చేందుకు
కాసిన్ని క్షణాలకి వడ్డీ కడుతూ వుండు..
మళ్ళీ ఉట్టి చేతుల్తోనే వెళ్తున్నానే అనే క్షోభ నీకెందుకు??



**దియా విఘ్నేష్**



# కేయూ రిజిస్ట్రార్‌గా మళ్లీ బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

- కలిసిన తెలంగాణ ట్రైబల్ స్టూడెంట్ ఫ్రంట్ నాయకులు

**హనుమకొండ,ఫిబ్రవరి 04(తెలంగాణ ముచ్చట్లు):** కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా మళ్లీ బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రాన్ని తెలంగాణ ట్రైబల్ స్టూడెంట్ ఫ్రంట్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ట్రైబల్ స్టూడెంట్ ఫ్రంట్ అధ్యక్షులు మాలోత్ వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కూడా చర్చించారు.

ఈ కార్యక్రమంలో టిటిఎస్ఎఫ్ ఇంచార్జి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పీహెచ్డీ స్కాలర్ భూక్య రమేష్ నాయక్, ఇంగ్లీష్ పీహెచ్డీ స్కాలర్ వినోద్, పొలిటికల్ సైన్స్ పీహెచ్డీ స్కాలర్ భానోత్ ఎలేందర్‌తో పాటు సుధీర్, యాదగిరి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# లోన్ యాప్ వేధింపులతో మరో ప్రాణం బలి

- రూ.3 వేల రుణానికి న్యూడ్ ఫొటోల బెదిరింపులు
- చిక్కడపల్లిలో వ్యక్తి ఆత్మహత్య
- న్యూడ్ ఫొటోలు పంపిస్తామని బెదిరింపులు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

లోన్ యాప్ వేధింపులు మరో ప్రాణాన్ని బలితీసుకున్నాయి. కేవలం రూ.3 వేల రుణం చెల్లించలేదన్న కారణంతో లోన్ యాప్ ఏజెంట్ల బెదిరింపులకు గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని చిక్కడపల్లి ప్రాంతంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చిక్కడపల్లిలో నివాసం ఉంటున్న ప్రేమ్ కుమార్ గతంలో ఓ లోన్ యాప్ ద్వారా రూ.3 వేల అప్పు తీసుకున్నాడు. ఆ మొత్తాన్ని సకాలంలో చెల్లించకపోవడంతో లోన్ యాప్ ఏజెంట్ తరచూ ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల మేడారం జాతరకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ప్రేమ్ కుమార్‌కు లోన్ యాప్ ఏజెంట్ల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసిన వారు, డబ్బు ఇవ్వకపోతే అతని ఫొటోలను న్యూడ్‌గా మార్చి కుటుంబ సభ్యులకు పంపుతామని, ఆన్‌లైన్‌లో వైరల్ చేస్తామని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ బెదిరింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రేమ్ కుమార్ బుధవారం తాను నివసిస్తున్న అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు లోన్ యాప్ నిర్వాహకుల పాత్రపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in